## మినీకథ

**ఆ రోజు త్వరగానే ఇంటి పని పూర్తిఅయింది. చదివేసిన నవల ఇచ్చి మరో పుస్తకం తెచ్చుకుందామని ఇంటికి తాళం వేసి రెండిళ్ళ అవతల వున్న తులసి వాళ్ళింటికి బయల్దేరాను.**

చైత్ర మాసపు ఎండ చిటపట లాడుతోంది!
రోడ్డు మీద సందడి కూడ ఆట్టే లేదు!



# మెరుగు

వి.కృష్ణవిజయ

నే వెళ్ళేసరికి తులసి వాళ్ళింటి వరండాలో ఇద్దరు యువకులు కూర్చుని చిన్న కొలిమిలాంటి దానితో ఏదో చేస్తున్నారు.

వాళ్ళచుట్టూ చిన్న చిన్న వస్తువులు. ఒక సంచి తప్పించి మరేమీ లేవు! తులసి పక్కనే కుర్చీ మీద కూర్చుని ఆసక్తిగా చూస్తోంది! "ఏమిటి తులసీ. చిన్న బంగారపు షాపు ఓపెన్ చేశావా!" అన్నాను.

"నువ్వా. రా! రా! నా మట్టెలు అరిగిపోయాయిలే. వీళ్ళెవరో చిన్న చిన్న వస్తువులు నమ్మకంగా ఇంటిదగ్గరే చేస్తామంటే పిలిచాను. మళ్ళీ బజారు ఏం వెళతాంలే అని."

"నమ్మకమేనా!" అన్నాను చాలచిన్నగా-తులసికి మాత్రమే వినిపించేలా.

"ఆ( మన కళ్ళముందరే చేస్తున్నారుగా!"

"మీ కేం( అలాంటి భయం అక్కర్లేదమ్మా! ఎన్నోచోట్ల చేశాం. కావాలంటే ఎవరైనా అడిగి చూడండి." మా మాటలు విన్నాడులా వుంది. అందులో ఒకతను మా వంక చూస్తూ అన్నాడు.

తులసీ.నేను దీక్షగా చూస్తుండగానే ధగధగ మెరిసిపోతున్న మట్టెలు తీసి మా ముందు వుంచాడు.

"పెట్టుకుని చూడండమ్మా! కావాలంటే సరి చేస్తాం" అన్నాడు. తులసి వేలికి పెట్టుకుని చూసి సరిపోయిందనుకుని తృప్తిపడింది.

తులసి లేచి డబ్బులు తెద్దామని లోపలికి వెళ్ళింది. "అమ్మా! మెరుగు పెట్టేందుకు కొంచెం కలపమంటే మావాడు తెలియక చాలా కలిపాడు. వృధాగా కింద పారబొయ్యాలి. మీ గాజులివ్వండమ్మా మెరుగు పెట్టి ఇస్తాను. ధగధగ మెరుస్తాయి" అంటూ నా రెండు జతల బంగారు గాజులవంక చూసి అడిగాడు.

తులసి వచ్చాక అతడన్న విషయం చెప్పాను.

"ఇవ్వు. నమ్మకంగానే చేసిచ్చాడుగా నా మట్టెలు" అంది తులసి.

"ఇప్పుడే చెప్పు ఆనక పేచీ వద్దు. మెరుగుపెట్టినందుకు ఎంత ఇవ్వమంటావు" అని అడిగాను.

"మీ ఇష్టంవచ్చినంత ఇవ్వండి. పోనీ ఒక్క రూపాయి ఇవ్వండి చాలు" అంటూ నా దగ్గర నుంచి గాజులు అందుకున్నాడు.

వాడి అమాయకత్వానికి నేను. తులసి ముసి ముసిగా నవ్వుకున్నాం. ఇదే షాపులో అయితే చాలా వసూలు చేస్తారన్న విషయం గుర్తు వచ్చి.

నా గాజులు తీసుకొని వాడి ముందు వున్న లోషన్‌లో పడేశాడు. ఒక్కసారిగా ఆ లోషన్ అంతకుముందున్న రంగుపోయి ధగధగ లాడసాగింది. వెంటనే అందులో నుంచి తీసి సబ్బునీళ్ళతో కడిగి బ్రష్ పెట్టి తోమి నాకిచ్చాడు.

గాజులు మరీ గొప్పగా మెరవకపోయినా ఇదివరక్కంటే నయం అనుకుంటూ తీసుకున్నాను.

ఆ లోషన్ సీసా పక్కవాడికిచ్చి బయటకు పంపేశాడు. తులసినే డబ్బు ఇవ్వమన్నాను.

ఇంటికొచ్చాక పని హడావిడిలో గాజుల మెరుపు సంగతి ఇంట్లో ఎవ్వరికీ చెప్పలేదు. మరునాడు పేపర్ చూస్తుంటే. "మెరుగు పెడతామంటూ బంగారాన్ని యాసిడ్‌లో కరిగించి మోసం చేస్తున్న ఉదంతం" అంటూ ప్రచురించిన విషయాన్ని చదివి కాళ్ళు గడగడ వణికాయి.నిన్నటి నుంచి నాగాజులు ఎంతో తేలిగ్గా అనిపించాయి. ఎవరితో అంటే ఏం తంటాయో అనుకుని దొంగకు తేలి కుట్టినట్లు వూరుకున్నాను. ఇంక ఆగలేక అప్పటికప్పుడు తులసిని తీసుకొని బజారు వెళ్ళాను.

షాపులో నా గాజులు తూస్తూనే "ఏమిటండీ! గాజులు ఏమైనా యాసిడ్‌లో పడేశారా! అంతా అక్కడక్కడా చెక్కులు వూడినట్లుంది" అంటున్న అతని వంక చూడలేక. "అబ్బే ఏం. లేదండి.చాలా ఏళ్ళయింది చేయించి.... అంతే!" అంటూ నసిగాను.

"జత ఎన్ని కాసులు పెట్టి చేయించారు?"

"మూడు."

"అబ్బో. అయితే చాలా అరిగిందే! ఇప్పుడు నాలుగు కాసులే వున్నాయి" అంటూ తూచి చెప్పాడు.

అంటే ఇంచుమించు రెండు కాసుల బంగారం కేవలం ఒక్క రూపాయికే.... నా తెలివి తక్కువతనం వలన పోగొట్టుకున్నా నన్నమాట. ఆ రోజు చాలా చౌకగా మెరుగుపెట్టాడని మురిసిపోయిన నాకు మంచి గుణపాఠం అయింది! ఒకటి కాదు రెండు కాదు నష్టపోయింది.... షుమారు రెండువేలు. మరి! నుదుటన పట్టిన చెమటను తుడుచుకుంటూ మాట. పలుకు లేకుండా ఇంటిదారి పట్టాం నేను. తులసి.